జగనన్న ప్రభుత్వంలోనే అభివృద్ధి

సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెంట్రల్‌లో కోట్లాది రూపాయల అభివృద్ధి జరిగిందని సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గాంధీనగర్ 36వ డివిజన్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ బాలి గోవింద్‌తో కలిసి ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి చేశామన్నారు. గడప గడపకు కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళుతుంటే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన బోండా ఉమా ప్రజలకు అందుబాటులో లేకుండా ముఖం చాటేశారని అన్నారు. కరోనా కష్ట కాలంలోనూ ప్రజల వైపు చూడలేదన్నారు. నాలుగు ఏళ్ల విదేశాల్లో జల్సాలు చేశారని ఎన్నికలు సమీపిస్తుండటంతో ఉమాకు ప్రజలు గుర్తుకు వచ్చారని ఎద్దేవా చేశారు. బోండాకు ప్రజా సమస్యలు ఏ మాత్రం పట్టవన్నారు. సెంట్రల్ నియోజకవర్గ ప్రజలను ఓటు అడిగే హక్కు ఉమాకు లేదన్నారు. బోండా కుల సంఘాల మీటింగ్‌లు ఎన్ని పెట్టిన ప్రయోజనం లేదన్నారు. ఉమాకు ఓటు వేస్తే రౌడీయిజం, గుండాయిజం పెరుగుతుందని ప్రజలే చెబుతున్నారని పేర్కొన్నారు.

షర్మిలను చంద్రబాబే పంపారు..

షర్మిల ఓటు తెలంగాణలో ఉందని, ఏపీ ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయని ఎమ్మెల్యే వెలంపల్లి పేర్కొన్నారు. షర్మిలను చంద్రబాబు పంపితేనే ఏపీకి వచ్చిందని చెప్పారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి రాష్ట్రానికి ఏం చేశాడని ప్రశ్నించారు. చంద్రబాబును పక్కన పెట్టి ఆయన భార్య భువనేశ్వరి రంగంలోకి దిగాలని చూస్తోందన్నారు. చంద్రబాబు, భువనేశ్వరి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. ప్రతిపక్షాలకు పేద ప్రజల సమస్యలు అవసరంలేదని, పెత్తందారులే వారికి కావాలన్నారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్ సీపీని ఓడించలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో 36వ డివిజన్ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

62వ డివిజన్‌లో..

పాయకాపురం(విజయవాడరూరల్): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 62వ డివిజన్‌లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పర్యటించారు. సుమారు 255 గడపలను సందర్శించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి, నాయకులు అలంపూరు విజయ్, సీహెచ్ రామిరెడ్డి, బోరా బుజ్జి, వెంకట్, రమేష్, హైమావతి, సావిత్రి, సుభాన్ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ



62వ డివిజన్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అలంకార్ సబ్‌స్టేషన్ 11కేవీ సత్యనారాయణస్వామి టెంపుల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, ఆంధ్రరత్న రోడ్డు, జమిందారు వీధి, స్వామిస్ట్రీట్, నాగేశ్వరరావు పంతులు రోడ్డు, జ్ఞానోలీవ్ స్ట్రీట్, స్విమ్మింగ్ పూల్ ఏరియా, సుందరమ్మ వీధి, భరద్వాజ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గిరిపురంకి చెందిన చిరుగురి కిరణ్‌కుమార్(24) ఇటీవల తెనాలిలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. అతని కుటుంబ దయనీయ పరిస్థితిని ఎమ్మెల్యే మల్లాది విష్ణు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన సీఎం జగన్ అతనికి కుటుంబానికి రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కును సింగ్ నగర్ ఆంధ్రప్రభకాలనీలోని తన కార్యాలయంలో మృతుని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే విష్ణు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, విపత్తుల సమయంలో బాధిత కుటుంబాలను మానవీయ కోణంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 62వ డివిజన్ మూడు బొమ్మల సెంటర్‌లో టీడీపీకి చెందిన 30 మంది కార్యకర్తలు అలంపూరు విజయ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలోకి చేరగా వారికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి మనమందరం కలిసి పనిచేద్దామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్, లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ అండ్ సమీర ఈస్ట్ లయన్స్ కంటి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం కృష్ణలంక నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బీ హనుమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత మెగా వైద్య శిబిరం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రముఖ వైద్య నిపుణులతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తామని పేర్కొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన వాగ్దేవి కూచిపూడి నృత్యాలయకు చెందిన నాట్యాచార సప్పా శివకుమార్ పర్యవేక్షణలో భవ్య, చరిష్మా, హాసిని, సాధన, లాస్యలతో పాటు పలువురు చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి అభినయాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన ఈ ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే వెలంపల్లి

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 62వ డివిజన్‌కు చెందిన బలిజ నాగబాబు గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వెంటనే స్పందించి సీఎం సహాయనిధి నుంచి రూ. 7 లక్షల విలువైన ఎల్‌ఓసిని బాధిత కుటుంబానికి శుక్రవారం సెంట్రల్ నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు అలంపూరు విజయ్, రామిరెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలు పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్సీ ఎండీ రూహుల్లా అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్ గిరిపురంలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ రూహుల్లా మాట్లాడుతూ ఏ ఇంటికి వెళ్లినా జగనన్న అందిస్తున్న పథకాలు తమకు అందాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ కొమ్ము చంటి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



24వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ ఎండీ రూహుల్లా, కార్పొరేటర్ అనిత

అక్కినేనికి స్వరాభిషేకం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, గీతాంజలి మ్యూజికల్స్ వేదగంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యాన సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. వేటూరి పాటల పరిశోధకుడు డాక్టర్ జయంతిచక్రవర్తి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు అక్కినేని నటించిన చిత్రాల్లోని పాటలను ఆలపించారు. డాక్టర్ జయంతిచక్రవర్తి మాట్లాడుతూ అక్కినేని తెలుగు సినిమా చరిత్రలో మకుటం లేని మహారాజు అని అన్నారు. నిర్వాహకులు అక్కినేని నాగేశ్వరరావు చిత్రపటాన్ని పూలమాలతో సత్కరించారు.



అక్కినేని చిత్రగీతాలు ఆలపిస్తున్న గాయకులు

రైల్వే అండర్ బ్రిడ్జ్ పనుల పరిశీలన

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం మధురానగర్‌లో నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రైల్వే శాఖ సమన్వయంతో త్వరలో రైల్వే అండర్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కనకదుర్గ వారధి వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా డైరెక్ట్‌గా వెళ్లే అవకాశం ఈ రోడ్ ద్వారా కలుగుతుందని చెప్పారు. ప్రజల రాకపోకలకు ఏర్పడుతున్న అసౌకర్యాన్ని దూరం చేసేందుకు రైల్వే అండర్ బ్రిడ్జ్ ఒక మంచి ప్రాజెక్ట్ అని తెలిపారు. రైల్వే శాఖ కూడా పనులను త్వరితగతిన పూర్తి చేస్తోందని పేర్కొన్నారు.



ఆర్‌యూబీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సామాజిక అంశాల సమాహారం.. మువ్వా శ్రీనివాసరావు కవిత్వం


విజయవాడ కల్చరల్: మువ్వా శ్రీనివాసరావు కవిత్వం సామాజిక అంశాల సమాహారమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో గురువారం మువ్వా శ్రీనివాసరావు రచించిన నాలుగు కవితా సంపుటలోని కవిత్వం ఆధారంగా 366 మంది రచయితలు రచించిన కవిత్వ విశ్లేషణా గ్రంథం 'అనితరుడు' పరిచయ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాపినేని మాట్లాడుతూ కవి మువ్వా శ్రీనివాసరావు కవిత్వంలో సామాజిక స్పృహ కనిపిస్తోందన్నారు. విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ ఏ సాహిత్య ప్రక్రియకైనా ప్రధాన లక్ష్యం సమాజ శ్రేయస్సేనని అన్నారు. ఆయన కవిత్వంలో నేడు సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను ప్రస్తావించారని, సమాజం పట్ల రచయితకు ఉండవల్సిన బాధ్యతను మరోసారి వివరించినట్లు తెలిపారు. సమావేశంలో అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, కవులు రావి రంగారావు, ఖాదర్ మొహిద్దీన్, అరసవల్లి కృష్ణ మువ్వా శ్రీనివాసరావు కవిత్వంలోని అంశాలను సమీక్షించారు. గ్రంథ సంపాదకులు అనిల్ డ్యానీ, పగడిపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కవులు శ్రీనివాసరావు కవిత్వంతో అనుబంధాన్ని పంచుకున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శివశంకర్

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ రజక సంఘం ఆధ్వర్యాన సంత్ గాడ్గే బాబా జయంతిని ఘనంగా నిర్వహించారు. రజక సంఘం ప్రతినిధులు గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాడ్గే జయంతి సందర్భంగా రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కందగట్ల శ్రీనివాసరావుకు రజక రత్న అవార్డును ప్రదానం చేశారు. ఆయనను ఏపీ రజక సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించి గండపెండేరం తొడిగారు. ఏపీ రజక సంఘం గౌరవాధ్యక్షుడు ఊకోటి శేషగిరిరావు మాట్లాడుతూ సంత్ గాడ్గే బాబా చేసిన సేవలను గుర్తు చేశారు. జంతు సంరక్షణ, నిరుద్యోగులకు ఉపాధి, నిస్సహాయులకు ఆలంబన, పేద యువతీ యువకులకు వివాహం చేయడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. రజక సంఘం నాయకులు గోపాలకృష్ణ, కందగట్ల రమేష్, నీలాపు శ్రీనివాసరావు, నీలాపు సాంబశివరావు, మురళీ, మోహన్‌రావు, ఏసీపీ భాస్కరరావు పాల్గొన్నారు.



29లోపు వ్యాపార లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ పరిధిలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేవారు తమ వ్యాపార లైసెన్స్‌లను ఈ నెల 29వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా సంబంధిత సచివాలయాల్లో లేదా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లించి రెన్యువల్ చేయించుకోవచ్చని నగరపాలక సంస్థ కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటివరకు సుమారుగా 60 శాతం మంది వ్యాపారస్తులు మాత్రమే వారి లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకున్నారని, మిగిలిన వ్యాపారస్తులు కూడా ఈ నెల 29 లోపు తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలని సూచించింది. ఆ తరువాత అయితే 25 శాతం అపరాధ రుసుముతో లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకోవల్సి ఉంటుందని పేర్కొంది.

రేషన్ కార్డుల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడులో శుక్రవారం నూతనంగా మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్‌లు అర్హులను గుర్తించి వారి ఇంటివద్దకే వెళ్లి రేషన్ కార్డులు అందజేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో అందినకాడికి దండుకున్నారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో నిండు మనస్సుతో జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, సామంతపూడి చిన్నా, పీపీ సుబ్బరాజు, ప్రసాదరాజు, విజయ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే పాలన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజల ముంగిటకే పాలనను తీసుకువచ్చిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. 58వ డివిజన్ తిలక్ రోడ్డులోని లబ్ధిదారులకు మంజూరైన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదల ప్రాణాలకు విలువ లేకుండా ఉండేదని, జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీకి పెద్ద పీట వేశారని తెలిపారు. గతంలో కేవలం ఐదు లక్షల రూపాయలు ఉండే పరిమితిని సీఎం జగనన్న ఏకంగా రూ. 25 లక్షల వరకూ పెంచడం జరిగిందని అన్నారు. నిరుపేదల జీవితాలను మెరుగుపరిచేందుకు ఇటువంటి విప్లవాత్మకమైన సంస్కరణలను ప్రవేశపెట్టిన జగనన్నకు మనమంతా తోడుగా ఉండాలని సూచించారు.

పచ్చదనంతో గార్డ్స్ యూనిట్

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఏపీఎస్పీఎఫ్) విజయవాడ గార్డ్స్ యూనిట్‌ను ఐజీ బి.వెంకట్రామిరెడ్డి శుక్రవారం సందర్శించారు. అసిస్టెంట్ కమాండెంట్ మల్లికార్జున ఆధ్వర్యంలో యూనిట్ ఆవరణలో నాటిన పలు రకాల మొక్కలను ఆయన పరిశీలించారు. తులసీ వనంతో పాటు వివిధ రకాలైన మొక్కలతో ఆవరణ పూర్తిగా పచ్చదనంతో నిండి ఆహ్లాదాన్ని పంచడంతో ఐజీ వెంకట్రామిరెడ్డి ముగ్ధులయ్యారు. ఆ పరిసరాల్లో తాను కొన్ని మొక్కలు నాటారు. కార్యాలయం ఆవరణలో పచ్చదనాన్ని అభివృద్ధి చేసిన సిబ్బందిని అభినందించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ జోనల్ కమాండెంట్ శంకరరావు, సీఐ కామేశ్వరరావు, ఎస్ఐ ఫణికుమార్ పాల్గొన్నారు.



200 మందికి అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శుక్రవారం 200 మందికి అన్నదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటుహక్కుపై అందరికీ అవగాహన కల్పించాలి

క్యాంపస్ అంబాసిడర్స్ స్వీప్ వర్క్‌షాప్‌లో కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం అధికారులపై ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ముఖ్యంగా అర్బన్ ప్రాంతంలో నిర్లిప్తతను తొలగించి ఓటింగ్ శాతం పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమాల్లో కీలక భాగస్వాములు కావాలని క్యాంపస్ అంబాసిడర్స్‌కు పిలుపునిచ్చారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లను చైతన్యపరచడం-భాగస్వామ్యం చేయడం (స్వీప్) కార్యక్రమంలో భాగంగా క్యాంపస్ అంబాసిడర్స్ (పాఠశాలలు, కళాశాలలు) వర్క్‌షాప్ శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో జిల్లాలో మిగిలిన నియోజకవర్గాలతో పోల్చితే విజయవాడ అర్బన్ నియోజకవర్గాల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదైందన్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ అర్బన్‌లో 85 శాతానికి పైగా ఓటింగ్ శాతం పెంచే లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఓటు నమోదుకు సువర్ణావకాశం

అర్హత ఉండి ఓటరుగా నమోదు చేసుకోని వారు వెంటనే ఫారం-6 ద్వారా ఓటు నమోదు చేయించుకునేలా చూడాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల వరకు ఓటర్ల జాబితాలో తొలగింపు, సవరణలకు అవకాశం ఉందన్నారు. నామినేషన్ల ప్రారంభం వరకు చేర్పులు, బదిలీలకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ విషయాన్ని అంబాసిడర్స్ గుర్తించాలంటూ ఫారం-6, ఫారం-7, ఫారం-8 ప్రయోజనాల గురించి వివరించారు. ఓటర్ హెల్ప్‌లైన్, ఫిర్యాదుకు వీలుకల్పించే సీ విజిల్ తదితర ఆన్‌లైన్ వేదికలపై కూడా అవగాహన పెంపొందించుకొని విద్యార్థులకు, ప్రజలకు తెలియజేయాలన్నారు. క్యూఆర్ కోడ్‌తో ఉండే ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లను కూడా ఓటర్లకు ఇస్తామన్నారు. ఈ-ఎపిక్ కార్డును కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

అందుబాటులో ఆన్‌లైన్ వేదికలు

ఆధునిక సాంకేతికత అందరికీ చేరువైన ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల కమిషన్ వివిధ యాప్స్, పోర్టల్స్‌ను అందుబాటులో ఉంచిందన్నారు. వీటిపై అవగాహన పెంపొందించుకొని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఈవో కేవీఎస్ కుమార్, జిల్లా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త కె.రమేష్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

–స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసరావు

సీఎం జగన్‌తోనే బీసీలకు న్యాయం

ఎంపీ కేశినేని నాని

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని బీసీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంట్ సమన్వయకర్త, ఎంపీ కేశినేని నాని అన్నారు. బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబిరాణి ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర బీసీ నాయకులు ఎంపీ కేశినేని నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీలను చంద్రబాబునాయుడు కేవలం ఓట్ల కోసం వాడుకుని వదిలేసేవాడని, కానీ జగనన్న బీసీలకు అన్ని రంగాల్లో అత్యధిక ప్రాధాన్యతను కల్పించి వారి అభ్యున్నతికి పెద్దపీట వేశారని కొనియాడారు. వేముల బేబీరాణి మాట్లాడుతూ బీసీలంటే సీఎం వైఎస్ జగన్‌కు అమితమైన ప్రేమ అని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాత్రమే బీసీలకు అసలైన గౌరవం లభించిందన్నారు. రాష్ట్రంలోని బీసీలంతా సీఎం జగనన్న వెంటే నడుస్తామని హామీ ఇచ్చారు. బీసీ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు బెజవాడ గణేష్, ఉపాధ్యక్షులు జగదీష్, ఎడ్ల పద్మ, మైలవరం అధ్యక్షుడు నాని, బెజవాడ శ్రీకాంత్, బాలాజీ, అనసూరి మణికంఠ, షేక్ దర్గా తదితరులు పాల్గొన్నారు.



బీసీ సంఘం నాయకులతో ఎంపీ కేశినేని నాని

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు కాలానుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ అన్నారు. కళాశాల విద్యార్థినులు ఇటీవల మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన సాహిత్య, సాంస్కృతిక అంశాల్లో సత్తాచాటి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ నీరజ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే బాలకృష్ణ, అధ్యాపకులు అభినందించారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నీరజ

స్వయం ఉపాధికి బడ్డీకొట్లు అందజేత

లబ్బీపేట(విజయవాడతూర్పు): నిరుపేద కుటుంబాలకు చెందిన ఇద్దరు మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత రూ. 25 వేలు విలువగల బడ్డీ కొట్లు ఇచ్చారు. వాటిని ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు చేతులు మీదగా శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే వెల్లంపల్లి మాట్లాడుతూ కార్పొరేటర్ అనిత గతంలో కూడా అనేక మందికి ఉపాధి నిమిత్తం తోపుడు బళ్లు, బడ్డీకొట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల్లో రక్తదానం మిన్న

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని దానాల్లోనూ రక్తదానం మిన్న అని బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ ఎంవీవీ బంగార్రాజు అన్నారు. స్థానిక చుట్టుగుంట బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్, గరిమెళ్ల లక్ష్మీసమీరా ఈస్ట్ లయన్స్ కంటి హాస్పిటల్ సహకారంతో రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలు చేయడంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు వరుసలో ఉంటుందన్నారు. కోవిడ్ సమయంలోనూ తమ ఉద్యోగులు రక్తదానం చేశారని తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ హనుమయ్య మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని సూచించారు. డెప్యూటీ జోనల్ మేనేజర్ సూర్యకిరణ్, హెచ్‌ఆర్ చీఫ్ మేనేజర్ రవీంద్ర, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జీఎస్ శంకర్‌గుప్తా, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డీ గోపీనాథ్, క్లబ్ కోశాధికారి బీ రమేష్, సుప్రభాత్, జే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.